# త్రికన్య

-ఎలక్ట్రాన్

ఆకాశమార్గంలో పయనిస్తున్న నారదునికి కర్ణామృతంగా వేణుగానం వినవచ్చింది. 'ఓహో! బృందావనాన్ని సమీపించాను కాబోలు. కృష్ణుని దర్శించి వెళ్ళుట మంచిద'ని నారదుడు తలచాడు. దిగే ప్రయత్నంలో ఉండగా ఆ మురళీనాదంలోని నిగూఢ సందేశం నారదుని పెదవులపై మందహాసం కలిగించింది. 'ఓయీ, నారదా! మనోహరమైన ఈ సాయం సమయంలో మరులుగొన్న గోపికల శృంగార దృక్ప్రవాహాలలో జలకాలాడుతున్న తరుణంలో – నను దర్శింప నేలకు దిగి ఏల అడ్డంకిగా నిలుస్తావు! నువ్వు చెయ్యవలసిన మహత్కార్యం మధురలో ఒకటుంది, అటు పోరాదా?!'

'అంతా నీ యిష్ట ప్రకారమే జరుగుతుంది కృష్ణా' అనుకొంటూ నారదుడు గగన తలంలో ముందుకు పయనించి మధుర రాజ్య రాజప్రాసాద ప్రాంగణంలో దిగాడు. రాజోద్యానవనంలో మామిడి చెట్టు కొమ్మకు వ్రేలాడ దీసిన ఊయల బల్ల మీద ఉగ్రసేన తనయుడైన కంసుడు కూర్చుని ఉన్నాడు. జరాసంధుని తనయులూ, కంసుని భార్యలూ అయిన 'అస్తి', 'ప్రాప్తి'లు కంసునికి యిరు పార్శ్వాలా కూర్చుని ప్రియ సంభాషణలు చేస్తున్నారు.

పూర్వ సందేశం లేకుండా ఆకస్మికంగా దిగి వచ్చిన నారదుని చూస్తూనే కంసుడు దిగ్గున లేచి ప్రణామం చేశాడు. అస్తి, ప్రాప్తిలు సిగ్గుతో బుగ్గలు కెంపులు కాగా నెమ్మదిగా లేచి నమస్కరించారు. కంసుడు మరోసారి నారదునికి ప్రణమిల్లుతూ, స్వాగత వచనాలు పలుకుతూ ఊయల మీద ఆశీనునికావించాడు.

ప్రాప్తి పరుగులాంటి నడకతో కొంత దూరము పోయి "త్రికన్యా! నారద మహా మునులు వచ్చారు. త్వరగా పోయి పాద ప్రక్షాళన కోసం జలాన్ని తీసుకురా" అని ఆజ్ఞాపించింది. అందినంత ఎత్తులో చంపక పుష్పాలను కోస్తున్న త్రికన్య తన చేతిలో ఉన్న పూల సజ్జను ప్రాప్తికి అందించి, తనకు సాధ్యమైనంత వేగంతో అంతఃపురం వైపు దారి తీసింది. ఓ వెండి పళ్ళాన్నీ, స్వర్ణ కలశంతో పన్నీటిని తీసుకొని, ఆయాస పడుతూ నారదుడు ఆశీనుడు కాబడ్డ ఊయల వద్దకు చేరింది. అస్తి త్రికన్య చేతి నుండి ముందుగా వెండి పళ్ళాన్నందుకొని నారదుని పాదముల చెంత ఉంచింది. కంసుడు నారదుని పాదము లెత్తి వెండి పళ్ళెంలో ఉంచాడు. త్రికన్య వద్ద నుంచి స్వర్ణ పాత్రనందుకొని ప్రాప్తి సుగంధ జలాన్ని నారదుని పాదాల మీద పోస్తుండగా కంసుడు కడిగి, ఆ పాదోదకాన్ని తన శిరస్సుపై చల్లుకున్నాడు. కంసుని భార్యలు కూడా అదే విధంగా చేసి త్రికన్య వైపు చూశారు.

త్రికన్య మెల్లగా వచ్చి నారదుని పాదాలకు మ్రొక్కింది. పచ్చిక నేల మీద నున్న పూల సజ్జలోంచి ఓ సంపెంగ పువ్వుని తీసి భక్తి భావనతో నారదుని కందించింది. 'ఇష్టకామనాసిద్ధిరస్తు' అని దీవించి, నారదుడా పుష్పాన్ని త్రికన్య దోసిలో ఉంచాడు. త్రికన్య ఆ పుష్పాన్ని కళ్ళకద్దుకొని, సిగలో తురుముకొని, వెండి పళ్ళాన్నీ, స్వర్ణ కలశాన్నీ తీసుకొని, కంసుని రాణులు ముందు నడుస్తుండగా వారిని వెన్నంటి భవన ప్రవేశం చేసింది.

ఏకాంతం లభించిన వెంటనే కంసుడు ఊయల పక్కగా ఉన్న పాలరాతి తిన్నె మీద నారదుని అనుమతితో కూర్చుని "ఆకలి దప్పులు లేని దేవఋషులు మీరు. మహతి తప్ప మరో భూషణం ధరించని వారు. సర్వసంగ పరిత్యాగులు. నిత్య సంచారులు. మీకే విధంగా సేవ చెయ్యగలవాడనో చెప్పండి" అన్నాడు వినయంగా.

"కంసా! సుభిక్షమైన మధుర సామ్రాజ్యాన్ని దక్షతతో పరిపాలిస్తున్నావు. నీ బల పరాక్రమాలు శత్రురాజులకూ, సామంతరాజులకు తెలియనివి కావు. అయినా ప్రాణ భీతితో శిశు హత్యాకాండకు పూనుకొని ప్రజలకు దూరమయ్యావు. ఏ ఒక్కరి మీది ద్వేషంతోనో ప్రజాద్వేషానికి గురికావడం నీలాంటి శూరునకు తగదు. నీ సోదరి దేవకిని అత్తింటికి తీసుకుని పోయే సమయంలో ఆకాశవాణి పలుకులు విన్ననాటి నుంచీ, ఆమె అష్టమ శిశువు నిన్ను హెచ్చరించి అదృశ్యమైన నాటి నుంచి, నీలోని యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం నశించసాగింది. నిన్ను కడతేర్చు శిశువెక్కడ పెరుగుతున్నాడో తెలియక సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నావు. రాజ్యపాలన విషయమై అశ్రద్ధ చేస్తే నీ దక్షత కొరవడుతుంది. అందుకనే నీ శ్రేయస్సు రాజ్య శ్రేయస్సూ కోరి నిన్నా సందిగ్ధావస్థ నుంచి తప్పించడానికి వచ్చాను" అన్నాడు నారదుడు.

"చెప్పండి మహామునీ, ఎక్కడున్నాడో చెప్పండి! నిరంతరమూ గుండెల్లో నిద్రించే ఆ శత్రువు పీడ వదిలించుకొంటే కాని నేను ప్రజలకు దగ్గర కాలేను. అందువలన నా కోసం కాకపోయినా, రాజ్య శ్రేయస్సు కోరయినా ఆ వివరాలు చెప్పి కరుణించండి" అని కంసుడు వేడుకొన్నాడు.

కంసుని ధూర్త వినయానికి నారదులో లోన నవ్వుకొన్నాడు. కాని ఆ నవ్వుని కనబడనీయకుండా నారదుడు గంభీరంగా అన్నాడు "కంసా! నువ్వెంతటి ధీరుడవైనా అమాయకుడవు. వేగుల ద్వారా సరి అయిన సమాచారం సేకరించకుండా అస్తవ్యస్త ధోరణిలో అనేకమంది దానవ వీరులను దేశం మీదకు వదిలావు. మొదటగా పంపిన పూతన తిరిగి రాలేదు. శకటాసురుడు, తృణావర్తుడు, వత్సాసురుడు, పూతన సోదరులైన బకాసుర అఘాసురులు నీకు తెలియని ఆ బాలుని చేతిలో హతులయ్యారు.

"ఆ బాలుడెవరో కాదు, వాస్తవానికి దేవకి అష్టమ ప్రసవంలో జన్మించిన వాడే! కృష్ణుడనే నామ ధేయంతో – యశోదా నంద గోపుల తనయుడిగా వ్రేపల్లెలో ఎదిగి కౌమార దశకు చేరుకొన్నాడు. అంతేకాదు, నీ సేవకులైన ధేనుకాసురుణ్ణీ, ప్రలంబాసురుణ్ణీ వధించిన బలరాముడు నీ సోదరి రోహిణి తనయుడే! యిటీవలి కాలంలో నువ్వు పంపిన వృషభాసురుడు, కేశి, వ్యోమాసురుడు – వీరు ముగ్గురూ హతమయింది కూడా ఆ కృష్ణుని చేతిలోనే! ఈ ఉదంతాలన్నీ వ్రేపల్లె పరిసరాల్లోనే జరిగాయన్న సంగతి గ్రహించి ఉంటే, బలరామకృష్ణుల ఉనికి ఏనాడో నీకు తెలిసి ఉండేది! ఇప్పుడైనా మించి పోయింది లేదు. కాస్త నిదానంగా లౌక్యంతో వ్యవహరించి విజయం సాధించు".

"మరి దేవకి గర్భాన అష్టమ శిశువుగా ఆడశిశువు జన్మించింది కదా! ఆకాశవాణి పలుకులకు, ఆ శిశువు మాటలకు పొంతన లేదే?" అన్నాడు కంసుడు అయోమయంగా.

"నీ ఏడుగురు సోదరీ మణులనూ వివాహమాడిన వసుదేవుడు తెలివి తక్కువ వాడు కాదు! చెరసాలలో దేవకికి జన్మించిన కృష్ణుణ్ణీ, వ్రేపల్లెలో యశోదకు జన్మించిన ఆడ శిశువునీ వ్యూహాత్మకంగా తారుమారు చేశాడు. ఇప్పుడు నిజం తెలిసింది కదా, వస్తాను మరి! ఎందుకైనా మంచిది, నీకీ సంగతి తెలిసినట్టు వసుదేవుడికి తెలియ నివ్వకు" అంటూ నారదుడు కంసుడికి మరి మాట్లాడడానికి ఆస్కార మివ్వకుండా గగన తలంలోకి చేరి అదృశ్యుడయ్యాడు.

అక్కడ అంతఃపురంలో త్రికన్య కంసుని రాణుల నుద్దేశించి అంది. "ఎర్ర చందనం, పునుగు, జవ్వాదిలతో లేపనం చేసి శయనాగారంలో ఉంచాను. మరి నాకు సెలవా?"


"ప్రాప్తి ఈ రోజే ఋతుస్నానం చేసింది. ప్రభువులకు నేనంటే మోహం మొత్తి ఉంటుంది. ఆ 'మై పూత'ల సంగతి ప్రాప్తికే చెప్పు!" అస్తి నవ్వుతూ, త్రికన్య కేసి చూస్తూ అంది.

శృంగార భరితమైన రాణుల జీవితాల్ని గురించి తెలిసిన త్రికన్య తన దురదృష్టానికి చింతిస్తూ భవనం వదిలి, రాజోద్యానవనంలోని బాట వెంబడి నడుస్తుండగా, కంసుడు అక్రూరునితో అంటున్న మాటలు విన్నది. "అక్రూరా! నువ్వు వ్రేపల్లెకు పోయి నేను చేయ సంకల్పించిన ధనుర్యాగానికి నా సామంతుడు నందగోపునితో సహా వ్రేపల్లె వాసుల నందర్నీ ఆహ్వానించి, దగ్గరుండి తీసుకురా, నువ్వే రథ సారధివై బలరామకృష్ణులను స్వయంగా తీసుకురా".

త్రికన్య మనసులోకి ఓ చల్లని మాటా, ఓ తెల్లటి కిరణం చొచ్చుకొని పోయాయి. ఏదో తెలియని ఆనందంతో ఆమె హృదయం ఉప్పొంగి పోయింది. తడబడుతున్న అడుగులతో రాజమార్గానికి పక్కనే ఉన్న ఓ వాటికలోని తన పర్ణ కుటీరం చేరుకొంది. ఆ రాత్రి నుంచి త్రికన్యకు నిద్ర కరువైంది. అక్రూరునితో వచ్చే కృష్ణుని దర్శనార్థమై – చంద్రునికోసం ఎదురు చూసే చకోర పక్షిలా, స్వాతి చినుకుల కెదురుచూసే ముత్యా శుక్తిలా ఎదురు చూడసాగింది. ఆ కృష్ణుని నయనాలు జగదానందకార కాలనీ, సర్వలోక సమ్మోహితాలనీ, కర్ణాకర్ణిగా విన్న త్రికన్య – కృష్ణుని కోసం నేత్రాంజనం చేయ నిశ్చయించింది.

పెద్దమట్టి ప్రమిదలో చిక్కటి ఆముదం పోసి మూడు రాళ్ళ మధ్యన ఉంచింది. గోమయంతో చేసిన ఓ బుసఖండాన్ని వత్తిగా పెట్టి వెలిగించింది. ఆ రాళ్ళపై తళతళ మెరిసే రాగి పళ్ళాన్ని బోర్లించింది. రాగి పళ్ళెం దట్టంగా మసిబారిన తర్వాత ఓ తాళ పత్రం సాధనంగా ఆ మసిని ఎందుతామరాకులో చేర్చింది. కొద్దిపాటి పచ్చకర్పూరాన్ని గోఘృతాన్ని కలిపి రంగరించి అంజనం చేసి ఓ రాతి భరిణెలో పొందుపరిచింది.

కంసుని ధనుర్యాగానికి వ్రేపల్లె వాసులందరూ తరలివచ్చి నగర పొలిమేరలలో నెలకొల్పిన శిబిరాలలో



బస చేశారని మధురా నగర వాసులకు తెలిసింది. చాలా మంది పురవాసులు కంసభీతిని పక్కకు నెట్టి ఒక్కరొక్కరుగా, గుంపులు గుంపులుగా పోయి వ్రేపల్లె వాసులను పలుకరించి రాసాగారు. ఎవరి నోట విన్నా బలరామకృష్ణుల ధైర్య సాహసముల గురించే! సమ్మోహన సౌందర్యాల గురించే!

రెండు దినాల పాటు మధురా నగరాన్ని సందర్శించి, వింతలూ, విశేషాలూ చూసి ధనుర్యాగ సమయానికి రాజ ప్రాసాదం చేరెదమని బలరామకృష్ణులు అక్రూరుని ద్వారా కంసునికి సందేశం పంపారు. బలరామకృష్ణులు తమ సమవయస్కులైన గోప బాలకులతో పురసందర్శనార్థమై బయలుదేరారు. బారులుతీరి మార్గాని కిరువైపులా నిలబడిన పురజనులు, కొదమ సింహాల్లా వస్తున్న బలరామకృష్ణుల ఠీవి చూసి ఆశ్చర్య భరితులయ్యారు.

త్రికన్య తన కుటీరం నుండి బయలుదేరి రాజమార్గం చేరుకొంది. జన సందోహాన్ని తప్పించుకొంటూ రాజమార్గం ఓ పక్కకు చేరడానికి పలుమారులు ప్రయత్నాలు చేసింది. ఆమె వ్యర్థ ప్రయత్నాలని చూసి కొంత మంది అవహేళన చెయ్యసాగారు. త్రికన్య మనసు 'కృష్ణా! నిను దర్శించు భాగ్యం నాకీ జన్మలో కలుగదేమో!' అని వ్యథ చెంద సాగింది.

జనం మధ్యలో కలిగిన అలజడిని గుర్తించి కృష్ణుడు బలరాముని చేయి విడిచి, రెండంగలలో జన సందోహాన్ని చేరి, దారి చేసుకొని త్రికన్య ముందు నిలిచాడు. "నీ అభీష్టాన్ని తీర్చడానికి మధురకు వచ్చాను. తలైనా ఎత్తి చూడక పోతే ఎలా?" కృష్ణుడు త్రికన్య నుద్దేశించి అన్నాడు.

"కృష్ణా! నువ్వు కూడా నన్ను అసహ్యం చేస్తున్నావా! తల ఎత్తి చూసేటందుకు వీలు లేని దానిని – నీ నయనాలకు కాటుక దిద్ది, ఆ సొగసుని చూసి ఆనందించాలన్న నా ఆశ పేరాశయే కదా? ఇంగిత జ్ఞానము లేని దానిని! అయినా నీ కోసం ఎంతో శ్రమించి చేసిన అంజనం ఈ రాతి భరిణెలో ఉంది, అందుకో" అని భరిణెలో ఉన్న దోసిలి పైకెత్తింది. త్రికన్య తన శిరస్సుని పైకి ఎత్తలేక పోయింది. ఆమెకు కనపడుతున్నవి కృష్ణ పాదార విందములే.

"నల్లని వాడను – నా కళ్ళకు కాటుక దిద్ది అపహాస్యము చెయ్యదలచిన దానవు నువ్వే! అయినా నీ మనసు తీర్చాలనే అనుకొంటున్నాను" అంటూ కృష్ణుడు తన పాదాలను ఆమె పాదాల మీద ఆన్చి నొక్కి పట్టాడు. తన అరచేతుల మధ్య త్రికన్య మోమును అదిమి పెట్టి లేవనెత్తాడు.

సంభ్రమంతో జనాలు వీక్షిస్తుండగా త్రికన్య వంగిన కటి ప్రదేశము నిటారుగా అయింది. వెన్ను నాశ్రయించుకొన్న గూని అదృశ్యమైంది. ఆమె మెడ శంఖాకృతి చెందింది. విరూపమైన త్రికన్య అపురూప సౌందర్యవతిగా మారి, శ్రీకృష్ణుని నయనాల్లో తన ప్రతిబింబాన్ని చూసుకొని అచ్చెరువు నొందింది.

మంత్రముగ్ధులై నిలబడి పోయి చూస్తున్న జనాలకి అశరీరవాణి వాక్కు వినిపించింది. "జనులారా! మీరింత వరకూ ఈమెను త్రివక్ర అనీ, కుబ్జ అనీ అవకాశము దొరికినప్పుడల్లా అవహేళన చేస్తూ వచ్చారు. విష్ణు భక్తు రాళ్ళూ, ప్రాణ స్నేహితురాళ్ళూ అయిన ముగ్గురు కన్యలు యాదృచ్ఛికంగా, అనాలోచితంగా ఓ యతికి తపో భంగం కావించారు. 'వికార బుద్ధులు కలిగిన మీరు ముగ్గురూ మరో జన్మలో వికార స్వరూపంతో ఒకే స్త్రీగా జన్మిస్తార'ని శాపమిచ్చాడు. అటు పిమ్మట శాంతించి, విష్ణాంశతో జన్మించిన ఓ నల్లనయ్యవలన విరూప విముక్తి కలుగుతుందని ఊరడించాడు. మీరు చూసినది ఆ దృశ్యమే!"

జనులందరూ భక్తితో చేతులెత్తి నమస్కరించారు. మాట మూగబోయి, అచేతనురాలైన త్రికన్య అతి ప్రయత్నం మీద భరిణె మూత తీసి, కృష్ణుని కళ్ళకు కాటుక దిద్దింది. ఆనంద పారవశ్యంలో మూగబోయిన ఆ గొంతును స్వాధీనంలోకి తెచ్చుకొని, "ఈ నీ కాటుక కళ్ళలోనే నిరంతరమూ బందీ నయ్యే వరం ప్రసాదించు కృష్ణా" అని భక్తితో అర్థించింది.

"కంసుని ధనుర్యాగ పరిసమాప్తి వరకు వేచి ఉండు!" అని గంభనంగా మాటలాడి కృష్ణుడు అక్కడి నుంచి కదిలి బలరాముని చేరాడు.

ఇప్పుడు త్రికన్య ముప్పంకరల కుబ్జకాదు, అపురూప సౌందర్య రాశి! ఆమె యిప్పుడు దుఃఖిత కాదు. ఆనంద స్వరూపుడైన శ్రీకృష్ణుడు హృదయంలో బంధితుడయ్యాడు. ఆమె నరనరాల్లో అనంత కోటి వసంతాల ప్రవాహాలు. ఆమె గుండె నిండా ఆమని కోయిల రాగాలు. ●